క్లుప్తంగా

చెగ్యాం బస్సును పునరుద్ధరించండి



డీఎంకు వినతిపత్రం ఇస్తున్న అక్రమ్‌ మాలిక్‌

జగిత్యాలటౌన్‌: చెగ్యాం బస్సును పునరుద్ధరించాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య జగిత్యాల జిల్లా కార్యదర్శి అక్రమ్‌ మాలిక్‌ కోరారు. జగిత్యాల జిల్లా కేంద్రం నుంచి గొల్లపల్లి, అబ్బాపూర్‌, వెల్గటూర్‌, ముత్తునూర్‌ మీదుగా గతంలో నడిచిన చెగ్యాం బస్సు సర్వీసును పునరుద్ధరించాలని కోరుతూ బుధవారం అక్రమ్‌ మాలిక్‌ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో జగిత్యాల నుంచి చెగ్యాం వరకు రోజుకు మూడు ట్రిప్పులు నడిచిన బస్సు నిలిపివేయడంతో ప్రయాణికులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని డీఎం వివరించారు. డిపో మేనేజర్‌ సునీత సానుకూలంగా స్పందించారని తెలిపారు.

సిరికొండ సొసైటీ చైర్మన్‌పై అవిశ్వాసం



అవిశ్వాస నోటీస్‌ ఇస్తున్న డైరెక్టర్లు

కథలాపూర్‌: మండలంలోని సిరికొండ సొసైటీ చైర్మన్‌ చుక్క దేవరాజంపై తొమ్మిది మంది డైరెక్టర్లు అవిశ్వాసం ప్రకటిస్తూ జిల్లా సహకార అధికారి సత్యనారాయణకు బుధవారం నోటీసు అందజేశారు. సొసైటీలో చైర్మన్‌ తోపాటు 13 మంది డైరెక్టర్లు ఉన్నారు. వీరిలో 9 మంది డైరెక్టర్లు.. చైర్మన్‌పై వ్యతిరేకంగా సంతకాలు చేసి లేఖను జిల్లా సహకార అధికారికి ఇచ్చారు. కార్యక్రమంలో వైస్‌ చైర్మన్‌ బత్తుల నరేశ్‌, డైరెక్టర్లు కందరి కిషన్‌రెడ్డి, ఏనుగు గంగారెడ్డి, నాంపెల్లి శ్రీధర్‌, భూపెల్లి లత, కందరి జీవన్‌రెడ్డి, లోకిని గంగనర్సయ్య, మోహన్‌రెడ్డి, మహేశ్‌ ఉన్నారు.

కాంగ్రెస్‌లోకి బీఆర్‌ఎస్‌ కౌన్సిలర్‌



కాంగ్రెస్‌లో చేరుతున్న నాగభూషణం

కోరుట్ల రూరల్‌: పట్టణానికి చెందిన బీఆర్‌ఎస్‌ కౌన్సిలర్‌ ఎంబెరి నాగభూషణం బుధవారం కాంగ్రెస్‌ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు సమక్షంలో కాంగ్రెస్‌ పార్టీలో చేరారు.

ధర్మారం ఎంపీటీసీ చేరిక..

మండలంలోని ధర్మారం ఎంపీటీసీ నాగిరెడ్డి సుభాశ్‌ రెడ్డి పట్టణంలోని జువ్వాడి భవన్‌లో కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగారావు సమక్షంలో బుధవారం కాంగ్రెస్‌ పార్టీలో చేరారు.


గురుకుల పాఠశాలలకు మాస్కుల వితరణ



ప్రిన్సిపాల్‌కు మాస్కులు అందిస్తున్న షాకీర్‌

మెట్‌పల్లి: పట్టణంలో ఉన్న బీసీ, ఎస్సీ బాలుర, బాలికల గురుకుల పాఠశాలలకు బుధవారం స్థానిక సిటీ బజార్‌ నిర్వాహకులు షాకీర్‌ హుస్సేన్‌ మాస్కులను అందజేశారు. నాలుగు గురుకులాలకు సుమారు ఆరు వేల మాస్కులను ఆయా ప్రిన్సిపాళ్లకు అందించారు. కోవిడ్‌ విస్తరిస్తున్న నేపథ్యంలో మాస్కులు అందించిన షాకీర్‌ను ఈ సందర్భంగా వారు అభినందించారు.

డిప్యూటీ సీఎంను కలిసిన రైతు ఐక్యవేదిక అధ్యక్షుడు



కోరుట్ల: పట్టణానికి చెందిన తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్‌ నర్సారెడ్డి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో కలిశారు. ఈ సందర్భంగా బట్టి విక్రమార్కకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్‌ ప్రభుత్వం కృషి చేయాలని శేర్‌ నర్సారెడ్డి కోరారు.

జోరందుకున్న యాసంగి వరి నాట్లు

- ఉపాధి పనులతో కూలీల కొరత
- మగ వారికి రూ.700, ఆడ కూలీలకు రూ. 500



నాటు వేస్తున్న కూలీలు

జగిత్యాలఅగ్రికల్చర్‌: జిల్లాలో యాసంగి సీజన్‌కు వరి నాట్లు జోరందుకున్నాయి. నార్లు పోసి 20–30 రోజులు కావడంతో, ఒక్కసారిగా రైతులు పొలాలను దున్నించి నాటు వేస్తున్నారు. అయితే, వరి నాటేసేందుకు కూలీలు దొరకడం లేదు. కూలీలు ఉపాధి హామీ పనులకు వెళ్తుండటంతో నాట్లకు ఇబ్బందిగా ఉంది. కొందరు రైతులు బ్రోకర్ల ద్వారా పశ్చిమబెంగాల్‌, బీహార్‌ రాష్ట్రాల నుంచి నాట్లు వేసే కూలీలను తెప్పిస్తుండగా, మరికొందరు నాటు వేసే మహిళలకు గుత్తలకు ఇస్తూ ముందే అడ్వాన్సులు చెల్లించాల్సిన దుస్థితి నెలకొంది.

జిల్లాలో దాదాపు 3 లక్షల ఎకరాల్లో వరి సాగు

జిల్లాలో ఓ వైపు ఎస్సారెస్పీ నీరు వస్తుండటం, వరదకాల్వకు తూములు, మోటర్ల ద్వారా సాగు నీరు అందుతుండటం, వ్యవసాయ బావులు, బోర్లలో పుష్కలంగా నీళ్లు ఉండటంతో వరి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతోంది. వ్యవసాయాధికారుల అంచన ప్రకారం యాసంగి సీజన్‌లో కనీసం 3 లక్షల ఎకరాలకు పైగా వరి సాగు చేస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు.

కూలీలకు ముందే అడ్వాన్సులు

నాటు వేసే ఆడ, మగ కూలీలకు రైతులు ముందే అడ్వాన్సులు ఇచ్చే పరిస్థితి నెలకొంది. వరి నాట్ల కూలీ గత ఏడాదితో పోల్చితే రూ 100 వరకు పెరిగింది. ఆడ మనిషి రూ 500 వరకు, మగ మనిషికి రూ 700 వరకు కూలీ ఇచ్చి నాట్లు వేయాల్సి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కూలీల రాకపోకలకు జీపు కిరాయిలను రైతులే చెల్లిస్తున్నారు. కొందరు బ్రోకర్లు పశ్చిమబెంగాల్‌, బీహార్‌ రాష్ట్రాల నుంచి మగ కూలీలను తెప్పించారు. దళారి ఖర్చుతో కలిపి కూలీలు ఎకరానికి రూ 4–5 వేలు తీసుకుంటున్నారు.

శ్రమ తగ్గించుకుంటున్న రైతులు

గతంలో నాలుగైదు రైతు కుటుంబాలు కలిసి, ఒక్కరి తర్వాత మరొకరు 15–20 రోజులు వరి నాట్లు వేసుకునేవారు. రైతులు, వారి కుటుంబసభ్యులకు తోడు ఒక్కరిద్దరు కూలీలను పిలుచుకుని సకాలంలో వరి నాట్లు వేసుకునేవారు. ఇప్పుడు మారిన పరిస్థితుల నేపథ్యంలో, రైతులు ఎంత ఖర్చు అయినా పరవాలేదంటూ, శారీరక శ్రమ తగ్గించుకునే ప్రయత్నం చేస్తున్నారు. బురద అంటకుండానే పొలాలు నాటు వేయాలని చూస్తున్నారు. అవసరమైతే కూలీలకు అదనంగా డబ్బులు ఇచ్చి, వరి నాట్లు అయ్యేలా చూస్తున్నారు. గ్రామాల్లో కూలీ పనులు చేసే వారే తక్కువ, ఆ కూలీలందరూ ఉపాధి హామీ పనుల కింద హరిత హారం కోసం మొక్కలు నాటేందుకు వెళ్తున్నారు. వ్యవసాయానికి ఉపాధి హామీని అనుసంధానం చేయాలని రైతులు, రైతు సంఘాలు మొత్తుకుంటున్నప్పటికీ ప్రభుత్వం ఆ దిశలో ఆలోచించడం లేదు.

కూలీలు దొరకడం లేదు



పొలం నాటు వేస్తానని వారం రోజులుగా కూలీల దగ్గరకు వెళ్లినప్పటికీ దొరకడం లేదు. రైతులందరూ ఒక్కసారిగా నాట్లు వేస్తుండటంతో కూలీలు దొరకక ఇబ్బందిగా మారింది. ఇతర గ్రామాల నుంచి కూలీలను ఆటోల్లో, జీపుల్లో తీసుకవచ్చి నాట్లు వేయిస్తున్నాం. – క్యాతం సాయిరెడ్డి, సింగరావుపేట, రాయికల్‌

ఉపాధి హామీకి అనుసంధానం చేయాలి



గ్రామాల్లో ఏ వ్యవసాయ పనికి కూలీలు దొరకడం లేదు. బురదలో దిగి నాటు వేసేందుకు అసలే రావడం లేదు. వ్యవసాయానికి ఉపాధి హామీని అనుసంధానం చేస్తేనే, కూలీల సమస్యకు పరిష్కారం లభిస్తుంది. – చీటేటి జీవన్‌ రెడ్డి, తొంబరావుపేట, మేడిపల్లి

సావిత్రిబాయి పూలేకు ఘన నివాళి





మెట్‌పల్లి, జగిత్యాలలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

జగిత్యాల/కోరుట్ల/మల్యాల/ధర్మపురి/రాయికల్‌: తొలితరం మహిళ ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అని జ ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ సత్యనారాయణ అన్నారు. బుధవారం మహిళ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవ పథకం, మహిళ సాధికారత విభాగం ఆధ్వర్యంలో సాయిత్రిబాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. పట్టణంలో టీబీసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్‌ ఆధ్వర్యంలో నిరుపేదలకు దుప్పట్లు, స్వెటర్స్‌ పంపిణీ చేశారు. కోరుట్ల పట్టణ శివారులోని మహమూద్‌ అలీ విజ్ఞాన కేంద్రంలో సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కన్వీనర్‌ తిరుపతి నాయక్‌, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు తన్వీర్‌ లతిక, తదితరులు పాల్గొన్నారు. మెట్‌పల్లి పట్టణంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విగ్రహానికి బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుప్పాల లింబాద్రి, కాంగ్రెస్‌ పట్టణాధ్యక్షుడు జెట్టి లింగం,నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ధర్మపురితో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో సావిత్రిబాయి పూలె జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక జూనియర్‌ సివిల్‌ కోర్టు ఆవరణలో బార్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో పూలె చిత్రపటానికి నివాళి అర్పించారు. రాయికల్‌ మండలం తాట్లవాయి, కట్కాపూర్‌ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. మల్యాల మండల కేంద్రంలో సావిత్రిబాయి పూలే జయంతిని ముదిరాజ్‌ యూత్‌ అధ్యక్షుడు దొంతరవేణి శేఖర్‌ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

రాజన్నకు మొక్కులు చెల్లింపు

కథలాపూర్‌: వేములవాడ ఎమ్మెల్యేగా ఆది శ్రీనివాస్‌ గెలవడంతో మండలంలోని చింతకుంట గ్రామానికి చెందిన కాంగ్రెస్‌ నాయకులు బుధవారం రాజన్నకు తలనీలాలు సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. అనంతరం ప్రభుత్వ విప్‌ ఆది శ్రీనివాస్‌ను సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ నాయకులు భైర మల్లేశ్‌, లోక నర్సారెడ్డి, ప్రభాకర్‌, రాజలింగం, పెద్ద భూమారెడి పాల్గొన్నారు.

ఉద్యమకారులను ఆదుకోవాలని వినతి

కథలాపూర్‌: ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాధన కోసం పోరాడిన ఉద్యమకారులను ఆదుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డిని ట్విట్టర్‌ ఎక్స్‌లో కోరినట్లు మండలానికి చెందిన సాంస్కృతిక కళాకారుల సంఘం జిల్లా నాయకుడు గుగ్లొత్‌ రవి బుధవారం తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి చొరవ చూపి ఉద్యమకారులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులు క్రీడల్లో పాల్గొనాలి

జగిత్యాల: విద్యార్థులు క్రీడల్లో పాల్గొనాలని డీఈవో జగన్మోహన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని జ్యోతి హైస్కూల్‌ ఐఐటీ అకాడమీకి చెందిన 8వ తరగతి విద్యార్థి సంజన ఇటీవల రంగారెడ్డి జిల్లాలో జరిగిన 67వ ఎస్జీఎఫ్‌ రాష్ట్రస్థాయి బాస్కెట్‌ బాల్‌ పోటీల్లో రజత పతకం సాధించి అండర్‌–14 జాతీయస్థాయి పోటీలకు ఎంపికై ంది. అలాగే సాత్విక్‌ కేరళ రాష్ట్రంలో సాఫ్ట్‌ బేస్‌బాల్‌ పోటీల్లో పాల్గొని రజత పతకం సాధించారు. వీరిద్దరిని బుధవారం అభినందించారు. డైరెక్టర్‌ బియ్యాల హరిచరణ్‌రావు, శ్రీధర్‌రావు, మానికరావు, రజిత, రామ్‌ నాయక్‌ పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్సీ కవిత రాక

జగిత్యాల: నిజామాబాద్‌ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జిల్లాలో నేడు పర్యటించనున్నారు. మెట్‌పల్లి పట్టణంలోని వీఆర్‌ఎం గార్డెన్స్‌లో కోరుట్ల నియోజకవర్గ కార్యకర్తల సమావేశానికి హాజరు కానున్నారని నాయకులు పేర్కొన్నారు.

నేడు లూయిస్‌ బ్రెయిలీ వేడుకలు

జగిత్యాల: లూయిస్‌ బ్రెయిలీ జన్మదినం పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమాధికారి భాస్కర్‌ తెలిపారు. జిల్లాలోని దివ్యాంగులు, ఆసక్తి గల వారు అందరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, అలాగే జిల్లాలో గుర్తింపు పొందిన అంధత్వ దివ్యాంగులకు పథకాలు అందించనున్నట్లు పేర్కొన్నారు.

హెర్బల్‌ బ్యూటీ పార్లర్‌ ప్రారంభం

కోరుట్ల: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌ ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన హెర్బల్‌ బ్యూటీ పార్లర్‌ను మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ అన్నం లావణ్య బుధవారం ప్రారంభించి మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. కార్యక్రమంలో నిర్వాహకులు బానాల రిషిత, బానాల శ్రీధర్‌, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు





అల్లీపూర్‌లో దరఖాస్తులు పరిశీలిస్తున్న ఆర్డీవో చిన్న మెట్‌పల్లిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

కోరుట్ల/మల్లాపూర్‌/ పెగడపల్లి/ ఇబ్రహీంపట్నం /కథలాపూర్‌/సారంగాపూర్‌/ధర్మపురి/పెగడపల్లి /రాయికల్‌: అర్హులైన ప్రతి ఒక్కరు దరఖాస్తు చేసుకోవాలని జగిత్యాల ఆర్డీవో నర్సింహమూర్తి అన్నారు. బుధవారం రాయికల్‌ మండలం అల్లీపూర్‌ గ్రామంలో ప్రజాపాలన కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. కోరుట్ల పట్టణంలో దరఖాస్తులను మున్సిపల్‌ కమిషనర్‌ రాజేశ్వర్‌ పరిశీలించారు. పెగడపల్లి మండలంలోని లింగాపూర్‌, ఆరవెల్లి, ఎల్లాపూర్‌ గ్రామాల్లో బుధవారం నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభల్లో 1490 మంది దరఖాస్తులు చేసుకున్నట్లు ఎంపీడీవో పుల్లయ్య తెలిపారు. ఇబ్రహీంపట్నం మండలంలో కోరుట్ల ఆర్డీవో రాజేశ్వర్‌ ప్రజాపాలన గ్రామసభలు పరిశీలించారు. కథలాపూర్‌ మండలంలోని పెగ్గెర్ల, పోసానిపేట, కలిగోటలో బుధవారం నిర్వహించిన ప్రజా పాలనలో 1,419 దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీవో జనార్దన్‌ తెలిపారు. సారంగాపూర్‌, బీర్‌పూర్‌ మండలాల్లోని ఐదు గ్రామాల్లో బుధవారం ప్రజాపాలన గ్రామసభలు జరిగాయి.రాయికల్‌ పట్టణంలో 11, 3 వార్డుల్లో ప్రజాపాలనను మున్సిపల్‌ చైర్మన్‌ మోర హన్మండ్లు ప్రారంభించారు. ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ధర్మపురి మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ సంగి సత్తమ్మ, కమిషనర్‌ రమేశ్‌ కోరారు. ధర్మపురి మున్సిపల్‌ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరించారు.

సామాజిక మాధ్యమాలకు బానిసలు కావొద్దు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై సందీప్‌

మల్యాల: విద్యార్థులు సామాజిక మాధ్యమాలకు బానిసలు కాకుండా చదువుపై దృష్టి సారించాలని ఎస్సై కుమారస్వామి అన్నారు. మండలంలోని తాటిపల్లి బాలికల గురుకుల కళాశాల విద్యార్థులకు బుధవారం పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన సామాజిక మాధ్యమంతో కలిగే దుష్పరిణామాలు అనే అంశంపై విద్యార్థులకు ఎస్సై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ పత్తెం శ్రీనివాస్‌ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సైబర్‌ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

బుగ్గారం: విద్యార్థులు సైబర్‌ నేరాల పై అవగాహన కలిగి ఉండాలని బుగ్గారం ఎస్సై సందీప్‌ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం సైబర్‌ నేరాలపై అవగాహన కల్పించారు. హెచ్‌ఎం మోహన్‌రెడ్డి,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు చెడుదారి పట్టొద్దు

మల్లాపూర్‌: యువత, విద్యార్థులు చిన్నవయసులోనే వ్యసనాలకు బానిసగా మారి చెడుదారి పట్టొద్దని ఎస్సై నవీన్‌కుమార్‌ అన్నారు. మండలంలోని రాఘవపేట జెడ్పీ హైస్కూల్‌లో సైబర్‌ నేరాలు, మాదక ద్రవ్యం, షీ టీంలపై విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. సైబర్‌ నేరాల పట్ల విద్యార్థుల అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. యువత, విద్యార్థులే లక్ష్యంగా దుండగులు సైబర్‌ నేరాలకు పాల్పడుతున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీ హైస్కూల్‌ హెచ్‌ఎం కేతిరి దామోదర్‌ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కళాశాల ఎదుట ఆందోళన



నిరసన వ్యక్తం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

జగిత్యాల: కళాశాలలో అత్యధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఏబీవీపీ నాయకులు జిల్లా కేంద్రంలోని ఓ కళాశాల ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరీక్ష ఫీజు కట్టమని విద్యార్థి ఇస్తే యజమాన్యం కట్టకపోవడంతో యూనివర్సిటీ నుంచి హాల్‌టికెట్‌ రాలేదని, కళాశాల తప్పిదంతో విద్యార్థి పరీక్షలకు దూర మయ్యాడని, వెంటనే యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. విద్యార్థికి ఈ సెమిస్టర్‌లో అవకాశం కల్పించాలన్నారు. అనంతరం కళాశాలలో ఫర్నిచర్‌ ధ్వంసం చేశారు.

ప్రజల సౌలభ్యం కోసమే పంచాయతీ భవనాలు

- ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్‌



జీపీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌

మెట్‌పల్లిరూరల్‌: ప్రజల సౌలభ్యం కోసమే నూతన గ్రామ పంచాయితీ భవనాలను నిర్మించినట్లు కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్‌ అన్నారు. మెట్‌పల్లి మండలం రామారావుపల్లెలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని,మినీ ఫంక్షన్‌ హాల్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో భీమేష్‌రెడ్డి, ఎంపీపీ సాయిరెడ్డి, సర్పంచ్‌ లక్ష్మి, ఎంపీటీసీ శంకరయ్య, నాయకులు పాల్గొన్నారు.

‘టెట్‌’ లేకుండా పదోన్నతులు కల్పించాలి



వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

మెట్‌పల్లి: ఉపాధ్యాయులకు టెట్‌తో సంబంధం లేకుండా పదోన్నతులు కల్పించాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం ఆర్డీవో కార్యాలయ ఏఓకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తులసీ ఆగమయ్య, గాదె నర్సింగరావు, అంకతి లింగారెడ్డి, శ్యామ్‌సుందర్‌, రాజు, సరిత, ప్రమీల తదితరులున్నారు.

ప్రభుత్వం పునరాలోచించాలి

కథలాపూర్‌: ఉపాధ్యాయుల పదోన్నతులకు టెట్‌ ఉత్తీర్ణత తప్పనిసరి అనే నిబంధనల విషయంలో ప్రభుత్వం పునరాలోచించాలని డీటీఎఫ్‌ జిల్లా కార్యదర్శి పులికాంత శశిధర్‌ డిమాండ్‌ చేశారు. బుధవారం కథలాపూర్‌లో డీటీఎఫ్‌ నాయకులతో కలిసి ఆయన మాట్లాడుతూ.. అన్‌ ట్రెయిన్డ్‌ ఉపాధ్యాయులను ఉపాధ్యాయులుగా తీసుకున్న సందర్భాల్లో ఈ నియమాలు ఎక్కడికి పోయాయని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సమావేశంలో డీటీఎఫ్‌ మండల బాధ్యులు కృష్ణారావు, సంజీవ్‌రెడ్డి పాల్గొన్నారు.

సర్పంచ్‌, ఉప సర్పంచ్‌ను సస్పెండ్‌ చేయాలి



బుగ్గారంలో వీడీసీ నాయకుల సమావేశం

బుగ్గారం: మండల కేంద్రంలోని గ్రామపంచాయతీలో జరిగిన అవినీతిలో సర్పంచ్‌,ఉపసర్పంచ్‌ల పాత్ర ఉందని వారిని సస్పెండ్‌ చేయాలని బుగ్గారం వీడీసీ కోర్‌ కమిటీ చైర్మన్‌ చుక్క గంగారెడ్డి కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు స్థానిక హనుమాన్‌ ఆలయ సమీపంలో గ్రామ పెద్దలతో బుధవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో గ్రామంలోని పలు సమస్యలపై వీడీసీ సభ్యులు చర్చించారు. జీపీలో జరిగిన అవకతవకలపై కార్యదర్శి మహబూబ్‌ పాషాను సస్పెండ్‌ చేయడాన్ని స్వాగతించారు. ఇందులో ప్రజాప్రతినిధుల పాత్ర ఉందని సమగ్ర విచారణ చేయాలని కోరారు. కార్యక్రమంలో వీడీసీ నాయకులు సుంకం ప్రశాంత్‌, పెద్దనవేణి రాజేందర్‌, పెద్దనవేణి రాగన్న, క్లోం నగేశ్‌, అహ్మద్‌, కొడిమ్యాల రాజన్న తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ అయోధ్య రాముని అక్షింతలు



అక్షింతలు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్‌, తదితరులు

కోరుట్ల: పట్టణంలో అయోధ్య రాముని అక్షింతలను పలు వార్డుల్లో బుధవారం ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్‌ కౌన్సిలర్‌ పెండెం గణేశ్‌, మహిళా నాయకులు పాల్గొన్నారు.

ధర్మపురి: పట్టణంలో బుధవారం అయోధ్య బాల రాముడి అక్షింతలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్‌ నాయకులు బండారి లక్ష్మణ్‌, ఆకుల శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

అయోధ్య రాముడి అక్షింతలకు భక్తితో స్వాగతం

సారంగాపూర్‌: అయోధ్య రాముడి అక్షింతలకు బుధవారం సాయంత్రం గ్రామస్తులు భక్తితో స్వాగతం పలికారు. స్థానిక శ్రీరామాలయం నుండి గ్రామస్తులు మంగళవాయిద్యాలతో వెళ్లి ప్రభుత్వ పాఠశాల వద్ద నుంచి స్వాగతం పలికారు.

సంక్షిప్త వార్తలు

క్యాలెండర్‌ ఆవిష్కరణ

కథలాపూర్‌: మండలంలోని తాండ్రియాల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల ఫొటోలతో కూడిన 2024 సంవత్సర క్యాలెండర్‌ను తయారు చేయించి బుధవారం ఎంఈవో ఆనందరావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ప్రతీ రోజు విద్యార్థులు క్యాలెండర్‌ను చూసి తమ దినచర్యను తయారు చేసుకుంటారని ఉపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌ గంగప్రసాద్‌, ఎస్‌ఎంసీ చైర్మన్‌ పంజాల ప్రసాద్‌, హెచ్‌ఎం వేముల శ్రీనివాస్‌, ఎమ్మార్సీ శేఖర్‌, సీఆర్‌పీలు కృష్ణప్రసాద్‌, గణేశ్‌, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

త్రిశక్తి ఆలయం వద్ద అక్రమంగా ప్రహరీ నిర్మాణం

మెట్‌పల్లి: పట్టణంలోని త్రిశక్తి ఆలయ ప్రధాన ద్వారం ఎదురుగా కొందరు అక్రమంగా ప్రహరీ నిర్మించారు. ప్రధాన ద్వారం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత గోడను నిర్మించారు. బుధవారం ఉదయం ఆలయానికి వచ్చిన కమిటీ సభ్యులు దీనిని గమనించి పోలీసులకు సమాచారమందించారు. వెంటనే అక్కడకు చేరుకున్న ఎస్సై చిరంజీవి సీసీ కెమెరాల్లో గోడ నిర్మించిన వారిని గుర్తించారు. అ తర్వాత సదరు వ్యక్తులను అక్కడకు పిలిపించి మరల ఇలాంటి చర్యలకు పాల్పడవద్దని మందలించారు. అనంతరం ప్రహరీ తొలగించారు.

పేదింటి అమ్మాయి వివాహానికి సాయం

మల్లాపూర్‌: పేదింటి అమ్మాయి వివాహానికి మెట్‌పల్లి ఫ్రెండ్స్‌ వెల్ఫేర్‌ చారిటబుల్‌ ట్రస్ట్‌ సభ్యులు సాయం చేశారు. మండలంలోని ఒబులాపూర్‌కు చెందిన పేదింటి అమ్మాయి సంగినేని జలకు ఫ్రెండ్స్‌ వెల్ఫేర్‌ చారిటబుల్‌ ట్రస్ట్‌ అధ్యక్షుడు సురిగి శ్రీనివాస్‌గౌడ్‌ ఆధ్వర్యంలో వివాహానికి పుస్తెమెట్టెలు, స్టీల్‌ సామాగ్రి, పెళ్లికి పట్టుచీర, 150 మందికి భోజనాలకు కావాల్సిన బియ్యం, వంటసరుకులు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ అలిశెట్టి రవి, ఎర్ర రమేశ్‌, ట్రస్ట్‌ సభ్యులు పాల్గొన్నారు.

గంగపుత్రుల హక్కుల సంరక్షణకు కృషి చేయాలి

మెట్‌పల్లి: గంగపుత్రుల హక్కుల సంరక్షణకు ప్రభుత్వం కృషి చేయాలని జిల్లా అధ్యక్షుడు పల్లికొండ ప్రవీణ్‌ కోరారు. పట్టణంలోని అర్‌అండ్‌బీ అతిథి గృహంలో బుధవారం నిర్వహించి సంఘం సమావేశంలో మాట్లాడారు. గంగపుత్రుల సాంప్రదాయ వృత్తిని దెబ్బతియడానికి బీఆర్‌ఎస్‌ కుట్రలు చేసిందన్నారు. కొత్తగా వచ్చిన కాంగ్రెస్‌ ప్రభుత్వం ఉపాధిని మెరుగుపర్చడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కంతి హరికుమార్‌, తోకల రాజు, ఎల్ల శ్రీనివాస్‌, పర్రె శంకర్‌ పాల్గొన్నారు.

డబ్బుతిమ్మయ్యపల్లిలో వైద్య శిబిరం

కొండగట్టు: కొడిమ్యాల మండలం డబ్బుతిమ్మయ్యపల్లిలో కమలాకర్‌ రెడ్డి యువసేన ఆధ్వర్యంలో బుధవారం ఉచిత హెల్త్‌ క్యాంప్‌ నిర్వహించారు. 250 మందికి కరీంనగర్‌ రెనే ఆస్పత్రి సహకారం టెస్టులు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ డబ్బు జగన్మోహన్‌రెడ్డి, ఉపసర్పంచ్‌ ముత్యంరెడ్డి, గోల్కొండరాజు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

మోరపల్లి గౌడ సంఘం కార్యవర్గం ఏర్పాటు

జగిత్యాలరూరల్‌: జగిత్యాల రూరల్‌ మండలం మోరపల్లి గౌడ సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా సల్లూరి శ్రీకాంత్‌గౌడ్‌, ఉపాధ్యక్షునిగా కొల్లూరి రంజిత్‌గౌడ్‌,సభ్యులను ఎన్నుకున్నారు.

మజీద్‌ కమిటీ సాదర్‌గా మహ్మద్‌ సాదుల్లా

మల్లాపూర్‌: సిరిపూర్‌ మజీద్‌ కమిటీ సాదర్‌గా మహ్మద్‌ సాదుల్లా, నాయపు సాదర్‌గా ఎండీ.మొహిన్‌, అధ్యక్షుడిగా ఎండీ.బాబాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ కమిటీ సభ్యులు తెలిపారు.

బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా రాజేశ్‌

మల్లాపూర్‌: బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా సిరిపురం రాజేశ్‌(మల్లాపూర్‌)ను నియమించినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బ్రహ్మాండబేరి నరేశ్‌ తెలిపారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
జగిత్యాల జిల్లా:
9951602934, 9000308905
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్‌ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్‌, ACO - 7997958214
జగిత్యాల : రాజమౌళీశ్‌ - 9392460005
ధర్మపురి : వెంకటేష్‌ - 8008019205
కోరుట్ల : సురేశ్‌ - 7997958210
టోల్‌ ఫ్రీ నెం. : 1800 425 9899